www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 15 మార్చి 2024

5

తూర్పుగోదావరి



ముక్కామలలో 10వ తరగతి పరీక్షా కేంద్రం

ప్రజాశక్తి-పెరవలి


ముక్కామల గ్రామంలో ఉన్న శ్రీ నల్ల పుల్లయ్య జిల్లా పరిషత్ హైస్కూల్లో పదో తరగతి పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసినట్టు గ్రామ సర్పంచ్ కేతా త్రిమూర్తులు తెలిపారు. గురువారం పరీక్షా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులు అధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించి గ్రామానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. విద్యార్థులకు ఉచితంగా ప్యాడ్, స్కేలు, పెన్సిల్ వస్తు సామాగ్రిని పంపిణీ చేశారు. గ్రామంలో నూతన పదవ తరగతి పరీక్ష కేంద్రంగా ఏర్పడడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు రేలంగి ఏసు, గ్రామ విద్యా కమిటీ చైర్మన్ అరిగెల నాగరాజు, కాలదాసి కృష్ణ, ఆచంట రాంబాబు, అరిగెల శ్రీను, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపి, జనసేన సీట్లపై ఉత్కంఠకు తెర

- టిడిపి రెండో జాబితా విడుదల
- నివురు గప్పిన నిప్పులా అసంతృప్తి
- ఐదింట టిడిపి, రెండు చోట్ల జనసేన
- పార్లమెంట్ అభ్యర్థిపై సందిగ్ధత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

టిడిపి, కార్యకర్తలు, అభిమానుల ఉత్కంఠతకు ఎట్టకేలకు తెరపడింది. టిడిపి, జనసేన ఉమ్మడి కూటమి గురువారం రెండో జాబితా విడుదల చేసింది. జిల్లాలోని ఏడు స్థానాల్లో తొలి జాబితాలో అనపర్తి, రాజానగరం, రాజమహేంద్రవరం సిటీ మూడు నియోజకవర్గాలను ప్రకటించిన విషయం విదితమే. రెండో జాబితాలో మిగిలిన నాలుగు స్థానాలైన రాజమహేంద్రవరం రూరల్, కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు అభ్యర్థులను ప్రకటించారు. మొత్తం ఏడు స్థానాల్లో ఐదింట టిడిపి, రెండు స్థానాల్లో జనసేన అభ్యర్థులు బరిలో నిలవనున్నారు. పార్లమెంటు స్థానంపై ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. టిడిపి, జనసేన కూటమి బిజెపితో జతకట్టిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో పార్లమెంట్ స్థానం బిజెపి కోరుతున్నట్లు సమాచారం. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది.



పట్టుపట్టి సాధించిన గోరంట్ల

రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి టిడిపి రూరల్ స్థానాన్ని పట్టుపట్టి సాధించారు. రాజమహేంద్రవరం రూరల్ బరిలో పోటీ చేసేందుకు టిడిపి, జనసేనల మధ్య గత కొంత కాలం కోల్డ్ వార్ జరిగిన విషయం విదితమే. టిడిపి నుంచి గోరంట్ల బుచ్చయ్య చౌదరి, జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ వంటి కీలక నేతలు ఇద్దరూ ఎవరికి వారు తామే రూరల్ నుంచి పోటీ చేస్తా మని ప్రక టించారు. దీంతో కొంత గందర గోళ పరస్థితులు నెలకొన్నాయి. ఈ పరస్థితిని చక్కదిద్దేందుకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన ప్రయత్నం ఫలించింది. కందుల దుర్గేష్‌ను నిడదవోలు నియోజక వర్గంలో పోటీ చేయాలని యాచించారు. తొలుత వెనుకడుగు వేసినప్పటికీ కందుల దుర్గేష్ ప్రస్తుతం నిడదవోలు బరిలో పోటీ చేసేందుకు సిద్ధం అయ్యారు. అయితే అక్కడ మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు నుంచి ఏ మాత్రం సహకారం ఉంటుందో వేచి చూడాల్సి ఉంది. రూరల్ నియోజక వర్గంలోనూ జనసేన కార్యకర్తల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. తప్పనిసరి పరిస్థితులలో అధినేత నిర్ణయానికి అంగీకారం తెలిపినా ఎన్నికల బరిలో ఏ మేరకు సహమ సహకారాలు అందిస్తారనే ప్రశ్న తేదేపాను వెంటాడుతోంది,

అసంతృప్తి సెగ

టిడిపిలో అసంతృప్తి సెగ మొదలైంది. మాజీ మంత్రి కెఎస్ జవహర్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని ఇప్పటికే ప్రకటించారు. కొవ్వూరు నియోజకవర్గంలో కెఎస్ జవహర్, మద్దిపట్ల శివరామకృష్ణ రెండు వర్గాలుగా చీలిపోయిన విషయం విదితమే. 2014లో కెఎస్.జవహర్ తెలుగుదేశం పార్టీ నుంచి గెలుపొందారు. తెలుగుదేశం కంచుకోటగా ఉన్న ఈ నియోజకవర్గంలో 2014 అనంతరం రెండేళ్లకే వర్గ విబేధాలొచ్చాయి. ఆదిపత్య పోరు కొనసాగింది. ఈ నేపథ్యంలో 2019లో టిడిపికి ఓటమి తప్పలేదు. అయితే ఈ ఐదేళ్లలోనూ పరిస్థితిని అధినేత చక్కదిద్దలేకపోయారు. తాజాగా గోపాలపురం మాజీ ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావుకు కొవ్వూరు అభ్యర్థిగా అవకాశం కల్పించారు. కెఎస్.జవహర్ రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తే టిడిపి గెలుపు కష్టమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు గోపాలపురం నియోజకవర్గంలో మద్దిపాటి వెంకటరాజుకు అధినేత చంద్రబాబు టికెట్ కన్‌ఫర్మ్ చేశారు. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు మద్దిపాటికి వ్యతిరేకంగా గతంలో నిరసన తెలిపిన విషయం విదితమే. టిడిపి కూటమి విజయశిఖరాలు చేరాలంటే అసంతృప్తులను బుజ్జగాల్సిందేనని స్థానిక నేతలు అభిప్రాయ పడుతున్నారు.



కారల్ మార్క్స్‌కు నివాళులరిస్తున్న సిపిఎం నాయకులు టిఎస్.ప్రకాష్, అరుణ్ తదితరులు

కార్ల్ మార్క్స్‌కు సిపిఎం ఘన నివాళి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం, దేవరపల్లి

కార్ల్ మార్క్స్ 114 వర్ధంతి సందర్భంగా స్థానిక శ్యామల సెంటర్ వద్ద సిపిఎం కార్యాలయంలో మార్క్స్ చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకులు టిఎస్.ప్రకాష్, జిల్లా కార్యదర్శి టి.అరుణ్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడుతూ మార్క్స్ ప్రపంచ కార్మికవర్గానికి దాస్ కాపిటల్, పెట్టుబడి గ్రంథాలను అందించారని కార్మిక వర్గం దోపిడీకి ఎలా గురవుతుందో చెప్పి, దోపిడీకి వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాడాలని చైతన్యం కలిగించారన్నారు. ప్రాణ స్నేహితులైన మార్క్స్, ఎంగెల్స్ చనిపోయే వరకు ప్రపంచంలో కార్మిక వర్గం పక్షాన ఎన్నో రచనలు చేసి కార్మిక వర్గ విముక్తికి తోడ్పడ్డారన్నారు. మార్క్స్ చనిపోయాక మార్క్స్ సమాధి వద్ద కేవలం ఎనిమిది మంది మాత్రమే ఉన్నారని, నేడు 180 దేశాల్లో మార్క్స్ వర్ధంతి, జయంతి సభలు జరుపుతున్నారని చెప్పారు. ఆనాడు మార్క్స్ చెప్పినట్టుగా నేడు ప్రపంచం ఆర్థిక సంక్షోభంలో ఉన్న తరుణంలో దీని నుంచి గట్టెక్కేందుకు మార్క్స్ పెట్టుబడిలో ఎక్కడైనా చెప్పి ఉంటాడని పెట్టుబడిదారులు, మతాధిపతులు సైతం మార్క్స్ గ్రంథాన్ని అధ్యయనం చేశారన్నారు. మార్క్స్ సిద్ధాంతం దోపిడీ అంతం అయ్యే వరకు చెక్కుచెదరదన్నారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పదేళ్లలో దేశంలో కార్మిక వర్గాన్ని తీవ్రంగా దోపిడీ చేస్తోందన్నారు. కార్మికవర్గం మీద దాడులు పెరిగాయన్నారు. దేశంలో మోడీ అనుసరిస్తున్న కార్మిక, కర్షక విధానాల వల్ల దేశంలో కార్మిక కర్షకులు తీవ్రంగా నష్టపోయారన్నారు. మోడీ ప్రభుత్వం దోపిడీదారులకు కొమ్ముకాస్తూ దేశంలో ప్రజల మధ్య అంతరాలు తీవ్రంగా పెంచిందని విమర్శించారు. మోదీ నాయకత్వంలో బిజెపిని గద్దె దించడంతోనే కార్మికవర్గం దేశంలో కాస్త ఊపిరి పీల్చుకుంటుందన్నారు. రానున్న ఎన్నికల్లో బిజెపి దాని మిత్రపక్షాలను, ఓడించాలని కార్మిక వర్గాన్ని బలపరిచే వామపక్ష పార్టీలను వారి మిత్రులను గెలిపించడం ద్వారా కార్మిక వర్గం నిలదొక్కుకుంటుందన్నారు. ఇదే మార్క్స్‌కు ఇచ్చే ఘనమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.తులసి, బి.పవన్, రాజులోవ, ఎన్.రాజా, సిపిఎం నాయకులు టి.సావిత్రి, ఐ.సుబ్రహ్మణ్యం, పాల్గొన్నారు.

దేవరపల్లిలో సిపిఎం సీనియర్ నాయకులు ఉండవల్లి కృష్ణారావు నివాసంలో మార్క్స్‌కు ఘనంగా నివాళి అర్పించారు. శ్రామిక వర్గ విముక్తికి మార్క్స్ దారులు చూపాడన్నారు. సిఐటియు మండల కార్యదర్శి ఎస్.భగత్ మాట్లాడుతూ మార్క్స్ సేవలన కొనియాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కె.రత్నాజీ, సిఐటియు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లిపూడి వెంకటలక్ష్మి, మహిళా సంఘం నాయకురాలు ఉండవల్లి ప్రభావతి, కె.ఉమ, ఎ.బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

కేడర్‌తో మాట్లాడి నిర్ణయం : జవహర్

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్

టిడిపి టికెట్ కేటాయించకపోవడంతో తన కేడర్‌తో మాట్లాడి నిర్ణయం తీసుకుంటానని మాజీ మంత్రి జవహర్ తెలిపారు. గురువారం జవహర్ తన నివాసంలో మాట్లాడారు. పార్టీ అధిష్టానం ఒక అభ్యర్థిని ఎంపిక చేసిందని, దీనిపై తన అనుచరులతోను, నాయకులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటానన్నారు. అవసరమైతే కొవ్వూరు నుంచి పోటీకి సైతం సిద్ధమని ప్రకటించారు. ఈ నేపథ్యంలో బొబ్బిలికి చెందిన మాజీ మంత్రి సుజయ్ కృష్ణ రంగారావు జవహర్ నివాసానికి చేరుకున్నారు. జవహర్ అనుచరులు రంగారావు వద్ద ఆందోళన చేపట్టారు. తమ నాయకునికి సీటు ఇవ్వకపోవడం దారుణమని ధ్వజమెత్తారు. జవహర్ నివాసం వద్ద ఉన్న ఫ్లెక్సీలను జవహర్ అనుచరులు చింపివేశారు.



జవహర్ నివాసం వద్ద అనుచరుల ఆందోళన

ఇబిసి నేస్తం నిధుల విడుదల

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

ఇబిసి నేస్తం లబ్ధిదారులకు గురువారం నిధులు విడుదల చేసిన నేపథ్యంలో కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ఇబిసి నేస్తం-3వ విడత కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాధవీలత, డిసిసిబి ఛైర్మన్ ఆకుల వీర్రాజు, ఇతర అధికారులు ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత మాట్లాడుతూ మహిళా లబ్ధిదారుల జీవితాల్లో సరికొత్త కాంతులను నింపే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహాన్ని అందిస్తోందన్నారు. డిసిసిబి ఛైర్మన్ ఆకుల వీర్రాజు మాట్లాడుతూ వైఎస్ఆర్ నేస్తం ద్వారా 45 నుంచి 60 ఏళ్ల లోపు వయసు గల రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, వెలమలతో పాటు ఇతర ఒసిలకు చెందిన అక్క చెల్లెమ్మలకు ఏటా రూ.15,000 చొప్పున మూడేళ్లలో మొత్తం రూ.45,000 ఆర్థిక సాయం అందజేస్తున్నట్టు చెప్పారు. స్వంత వ్యాపారాలు చేసుకుని వారి కాళ్ల మీద వాళ్లు నిలబడే విధంగా లబ్ధిదారులకు ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ ఆకుల వీర్రాజు, బిసి కార్పొరేషన్ సహాయ కార్యనిర్వహణ అధికారి, పి.సుబ్రహ్మణ్యేశ్వర రావు, జిల్లా బిసి సంక్షేమ అధికారి పి.ఎస్ రమేష్, లబ్ధిదారులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న కలెక్టర్ మాధవీలత

ఢిల్లీ రైతులకు రైతు సంఘం మద్దతు

ప్రజాశక్తి-చాగల్లు

ఢిల్లీలో రైతులు చేస్తున్న ఆందోళనకు రైతు సంఘం మద్దతు తెలిపింది. గురువారం సంఘం కార్యాలయం వద్ద రైతు సంఘం జిల్లా కన్వీనర్ గారపాటి వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో రైతులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్ర రైతు సంఘం పిలుపు మేరకు ఢిల్లీలో రైతుల ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభకు మద్దతుగా తమ మద్దతు తెలిపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కామిశెట్టి కనకదుర్గారావు, సిఐటియు మండల కార్యదర్శి ఎస్‌కె.ఆదం, మండల రైతు సంఘం నాయకులు కంకటాల బుద్ధుడు, చెరుకు రైతు సంఘం నాయకులు కొటారు నాగేశ్వరరావు, కె.గంగాధరం తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ నిలుపుదల

ప్రజాశక్తి-పెరవలి

విద్యుత్ ఉపకేంద్రం మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఖండవల్లి ఫీడర్, మల్లేశ్వరం ఫీడర్, పెరవలి ఫీడర్, పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామమని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.వీరభద్రరావు, ఎఇ డేవిడ్ నిచ్చల్ తెలిపారు. ఖండవల్లి, అన్నవరపాడు పిట్టలవేమవరం, నల్లాకులవారిపాలెం, ముక్కామల, కొత్తపల్లి అగ్రహారం కాపవరం, పెరవలి, అజ్జరం, తీపర్రు, కాకరపర్రు, వెంకటరాయపురం పరిసర గ్రామ ప్రాంతాలతకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. వ్యవసాయ విద్యుత్ సమయాలు ఉదయం 5 గంటల నుంచి 8 గంల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకూ మార్చినట్టు తెలిపారు.

ఇళ్లలోకి జిఎస్ఎల్ ఆసుపత్రి వ్యర్థాలు

ప్రజాశక్తి-రాజానగరం

రాజానగరం రావులచెరువు గట్టు ప్రక్కన ఉన్న శ్మశాన వాటిక భూమిలో జిఎస్ఎల్ మెడికల్ కళాశాల జనరల్ ఆసుపత్రి రోగులు ఉపయోగించిన వ్యర్థాలు మెడికల్ కళాశాల వాహనాల్లో తీసుకుని వచ్చి వేస్తున్నారు. ఇవి సమీపంలో నివాసం ఉంటున్న ఇళ్లలోకి వస్తున్నాయని గ్రామస్తులు గురువారం ఆందోళన చేశారు. జిఎస్ఎల్ మెడికల్ కళాశాల ఆసుపత్రిలో రోగులకు ఉపయోగించిన సిలైన్ బాటిల్స్, శస్త్ర చికిత్స చేసినప్పుడు రక్తంతో తడిసిన దూది, గాజు గుడ్డలు, గడువు ముగిసిన మందులు, రోగులు తిన్న ఆహార పదార్థాలను లారీలు, ట్రాక్టర్లతో తీసుకుని వచ్చి ప్లాస్టిక్ సంచుల్లో మూటలు కట్టి వేస్తున్నారు. నిబంధనల ప్రకారం శస్త్ర చికిత్స వ్యర్థాలను బయోమెడికల్ కంపెనీలకు పంపి మెడికల్ వ్యర్థాలను దహనం చేయాలి. ఈ నిబంధనలు తుంగలో తొక్కి జిఎస్ఎల్ మెడికల్ కళాశాల నుండి వచ్చే వ్యర్థాలను నేరుగా శ్మశాన వాటికలో వేస్తున్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు తీసుకుని వచ్చిన వ్యర్థాలను రాత్రి సమయంలో నిప్పు పెట్టి అంటిస్తున్నారు. దీని వల్ల సమీపంలో ఇళ్లలోకి నల్లటి కెమికల్ పొగ ఆవరించి దగ్గు, కళ్లు మంటలు, చర్మపై దద్దుర్లు వస్తున్నాయని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. మరోపక్క రక్తంతో తడిసిన దుస్తులు మందులు గాలికి ఎగురుతూ ఇళ్లలోకి నేరుగా వస్తున్నాయి. దీనిపై గ్రామస్తులు తీవ్ర ఆందోళన చెంది జిఎస్ఎల్ మెడికల్ కళాశాల చెందిన ట్రాక్టర్ను అడ్డుకున్నారు. వెంటనే మెడికల్ కళాశాల వ్యర్థాలను స్మసాన వాటికలో వేయకుండా నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



శ్మశాన వాటికలో జిఎస్ఎల్ వ్యర్థాల వద్ద గ్రామస్తుల ఆందోళన

లారీ యజమానులు, కార్మికులకు అవగాహన

ప్రజాశక్తి-దేవరపల్లి

దుద్దుకూరులో లారీ యజమానులు, కార్మికులతో దేవరపల్లి సిఐ బాల సురేష్‌బాబు, ఎస్ఐ శ్రీహరిరావు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. క్వారీ పరిశ్రమలో రవాణా చేస్తున్న లారీలపై ఓవర్ లోడ్, ఓవర్ స్పీడ్ వల్ల ప్రమాదాలను వివరించారు. మెటల్, ఇసుక రవాణా చేస్తున్న లారీలపై టార్పాలిన్ వంటి క్లాతులు కట్టాలని సూచించారు. రోడ్డుపై ప్రయాణం చేస్తున్న వారిపై ఎటువంటి దుమ్మూ ధూళీ లేకుండా రవాణా చేయాలని చెప్పారు. ప్రమాదాలు జరగకుండా ప్రతి లారీ యజమానీ, డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లైసెన్సులు లేకుండా లారీలు నడప రాదని, ప్రతి లారీకు ఇన్సూరెన్స్ కచ్చితంగా చేయించాలని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మస్తాన్, ఆకాష్, ఏడుకొండలు, సత్యనారాయణ, యజమానుల సంఘం నుంచి భద్రం, శ్రీను, బాజీ రాజు, శివన్నారాయణ, జయంత్, శేషగిరి, గణేష్ పాల్గొన్నారు.

వేగేశ్వరపురంలో అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-తాళ్లపూడి

అన్ని వర్గాల ప్రజల కష్టనష్టాలను గుర్తించి నూటికి నూరు శాతం మంచి చేయడమే ముఖ్యమంత్రి జగన్ ఘనత అని వైసిపి కొవ్వూరు నియోజకవర్గం ఇన్‌ఛార్జి, ఎంఎల్ఎ తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని వేగేశ్వరపురంలో గురువారం సిసి రోడ్లు, నాడు-నేడు అభివద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం ఎన్నోసార్లు బటన్ నొక్కిన ముఖ్యమంత్రి జగన్‌ను మరోసారి సిఎం చేయాలంటే ప్రజలంతా రానున్న ఎన్నికల్లో రెండుసార్లు బటన్ నొక్కి వైసిపి ఎంఎల్ఎ, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన మాజీ సర్పంచ్ కొమ్మిరెడ్డి వెంకటేశ్వరరావు విగ్రహాన్ని ఎంఎల్ఎ ఆవిష్కరించారు. గ్రామానికి వచ్చిన తలారిని సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశు రామారావు, నాయకులు సీర్ల బ్రహ్మానందం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, గ్రామ సచివాలయ కార్యదర్శి శ్రీనివాస్, వైసిపి మండల అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు, పలు గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఎంఎల్ఎ వెంకట్రావు మలకపల్లిలో వైసిపి నాయకుడు పుప్పాల వెంకట్రావు ఇంట వివాహ వేడుకకు హాజరయ్యారు.




అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎంఎల్ఎ వెంకట్రావు

ఓటు హక్కుపై అవగాహన

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ధవళేశ్వరం స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయం వద్ద గురువారం స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ముత్యాల పోసి కుమార్ ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ కెఎన్.జ్యోతి పాల్గొని మాట్లాడారు. వృద్ధులు, వికలాంగులకు ఓటు హక్కు వినియోగానికి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. వారు బిఎల్ఒలను సంప్రదించి వారి ద్వారా ఫారం 8. నమోదు చేసుకుని ఇంటి దగ్గరే ఓటు హక్కు వినియోగించుకునే సదుపాయం ప్రభుత్వం కల్పించిందన్నారు. ఓటర్ లిస్టులో నమోదు కానీ వృద్ధులు, వికలాంగులకు ఓటు నమోదు చేసుకునే అవకాశం ఇంకా ఉందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ డిడి సందీప్, డిడిఆర్‌సి స్టాఫ్ సుధాకర్, సన్యాసిరావు, సోమ, రంగమణి పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



1,286 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ

ప్రజాశక్తి - సీతానగరం

నియోజకవర్గం వ్యాప్తంగా పలు గ్రామాల్లో గురువారం 1,286 మంది లబ్ధిదారులకు ఎంఎల్ఎ జక్కంపూడి రాజా ఇళ్ల పట్టాలు అందజేశారు. ముక్కినాడు గ్రామంలో 91 మందికి, తూర్పుగానుగూడెంలో 180 మందికి, దోసకాయలపల్లిలో 255 మందికి, గాడాల గ్రామంలో 230 మందికి జంబూపట్నం గ్రామంలో 45 మందికి, శ్రీరంగపట్నం గ్రామంలో 250 మందికి, కోటికేశవరం గ్రామంలో 145 మందికి, చీపురుపల్లి గ్రామంలో 30 మందికి, పెదకొండేపూడి గ్రామంలో 60 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలు అందించామన్నారు. ఎంఎల్ఎ జక్కంపూడి రాజా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రవేశపెట్టిన ప్రతి సంక్షేమ పథకం పేదల మెరుగైన జీవనశైలికి దోహద పడుతోందన్నారు. అమ్మ ఒడి దగ్గర్నుంచి విద్యాదీవెన, వసతి దీవెన, చేయూత, చేదోడుతో పాటు 31 లక్షల మందికి పైగా పేద అక్కాచెల్లెమ్మలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారన్నారు. 2019 ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేరుస్తూ దాదాపు రూ.2.70 లక్షల కోట్లను నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ అకౌంట్లో జమ చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఇళ్ల స్థలాలు కేటాయింపుతో పాటు ఇళ్ల నిర్మాణం చేపట్టే బాధ్యత ప్రభుత్వం తీసుకుందన్నారు. ఇళ్ల నిర్మాణం చేపట్టే వారికి రూ.లక్షా 80 వేల ఆర్థిక సహాయం అందజేస్తున్నామన్నారు.




పట్టాలు పంపిణీ సభలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ రాజా

ఘనంగా జనసేన ఆవిర్భావ ఉత్సవాలు

జనసేన పార్టీ ఆవిర్భావ ఉత్సవాలను గురువారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

గోకవరం ప్రభుత్వాసుపత్రి సమీపంలో జనసేన పార్టీ జెండాను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆవిష్కరించారు. **కడియం** బొబ్బిలి బ్రిడ్జి సెంటర్‌లో పారన్టీ జండా ఎగరవేసి, కేకులు కట్ చేసి, సంబరాలు చేసుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు ముద్రగడ జెమ్మి, కడియపులంక సర్పంచ్ పాటంశెట్టి రామ్‌జీ, చిరుకూరి నాగేశ్వరరావు, తోరాటి వసంతరావు, ముద్రగడ సుధాకర్, మర్రి శంకర్, కళ్యాణం సూరిబాబు, తమ్మిశెట్టి ప్రసాద్, మార్గాని ఏడుకొండలు, తుమ్మా రాజు, దామిశెట్టి నాగరాజు, కందుకూరి సుబ్రహ్మణ్యం, అడబాల రాజు, గంధం వీరబాబు, తామెళ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. **తాళ్లపూడి** తాడిపూడిలో పార్టీ ఆవిర్భావ వేడుకలు పార్టీ మండల అధ్యక్షుడు గంటా కృష్ణ కష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. **పెరవలి** తీపర్రు, కాకరపర్రు, పెరవలి, కాపవరంలో నిడదవోలు నియోజవర్గ జనసేన పార్టీ అభ్యర్థి కందుల దుర్గేష్ జెండాను ఆవిష్కరించారు. నియోజకవర్గ ఇన్చార్జ్ భోగవల్లి ప్రసాద్, మండల అధ్యక్షుడు పిప్పర రవి కుమార్, నందీప చక్రవర్తి, తులా చినబాబు, పెనుగుర్తి నాగరాజు, ఆకుల సుబ్బారాయుడు, కోటిపల్లి మురళి, కోలా సీతయ్య నాయుడు, గుడాల రంగారావు, రంకిరెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు. **గోపాలపురం** పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి జెండాన ఆవిష్కరించారు. గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి సువర్ణ రాజు, పోసిన గణపతి, సూర్య భగవాన్, రామలీల, ప్రగడ రాంబాబు, శ్రీను, సత్యనారాయణ, సీతారామ రాజు, చిలక వెంకన్న, శివ, రమేష్, నాని పాల్గొన్నారు.



కడియంలో జనసేన పార్టీ నాయకుల ఉత్సవం

నేరాలు ఘోరాలు

యువకునిపై పోక్సో కేసు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు తన ఫోటోలు సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తానని బెదిరించిన యువకునిపై పోక్సో కేసు నమోదు చేశారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక తండ్రి జీవిలక చనిపోయారు. ఉండ్రాజవరం మండలం పాలంగి గ్రామానికి చెందిన కడలి దుర్గాప్రసాద్ అనే యువకుడు ఆమెతో ఫోన్లో పరిచయం పెంచుకున్నాడు. ఆమె ఫొటోలతో కాలర్గ్రాం చిత్రీకరించాడు. వీటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని బెదిరించాడు. దీనిపై బాలిక ఇచ్చిన ఫిర్యాదుపై గురువారం కేసు నమోదు చేశామని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

176 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - వేకర్లం

అక్రమంగా తరలిస్తున్న 176 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ తెలిపిన వివరాల మేరకు ప్రత్యేకాధి సిఐ ఎస్ఎ ఆతలత సిబ్బందితో జాతీయ రహదారిపై గస్తీ నిర్వహిస్తున్నారు. తుని నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న ఐసర్ వ్యాన్ అనుమానాస్పదంగా కనిపించడంతో కొవ్వూరు టోల్‌గేట్ వద్ద అడ్డగించి తనిఖీ చేశారు. వ్యాన్ కింద భాగంలో ఆయిల్ ట్యాంకర్ పక్కన ప్రత్యేకంగా అమర్చిన బాక్సులో 84 గంజాయి ప్యాకెట్లను గుర్తించారు. గంజాయి బరువు 176 కిలోలు ఉందని దాని విలువ రూ.9 లక్షలకు పైగా ఉంటుందన్నారు. వ్యాన్‌తో పాటు తెలంగాణ రాష్ట్రం పెద్దపల్లి జిల్లాకు చెందిన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నామని తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది వెంకన్నదొర, కస్తూర్గున, దొరబాబు, రాంబాబు, రాజు రామకృష్ణ, సలీం ఉన్నారు.

కొవ్వూరులో పాత కాపుల మధ్యే పోటీ..

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్

టిడిపి కొవ్వూరు నియోజకవర్గం అభ్యర్థిగా గోపాలపురం మాజీ ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావుకు ఆ పార్టీ టికెట్ కేటాయించింది. ఈ సందర్భంగా గత రెండు నెలలుగా పార్టీ టికెట్‌పై నెలకొన్న సస్పెన్స్‌కు తెర పడింది. ఈసారి తమకే టికెట్ అంటూ మాజీ మంత్రి జవహర్‌తో పాటు ఆయన వర్గం పెట్టుకున్న నమ్మకంపై నీళ్లు చల్లినట్లు అయింది. మరోవైపు టికెట్‌పై ఆశలు పెట్టుకున్న ఆశావహులకు నిరాశ ఎదురయింది.

దీంతో పాత కాపుల మధ్యే మరలా పోటీ అనివార్యమైంది. 2014, 2019 ఎన్నికల్లో గోపాలపురం నియోజకవర్గం నుంచి టిడిపి అభ్యర్థిగా ముప్పిడి వెంకటేశ్వరరావు, వైసిపి అభ్యర్థిగా తలారి వెంకట్రావు పోటీ పడ్డారు. 2014లో ముప్పిడి విజయం సాధించగా, 2019లో తలారి విజయం సాధించారు. ఔతివల జరిగిన పరిణామాలలో గోపాలపురం ఎంఎల్‌ఎగా ఉన్న తలారి వెంకట్రావును వైసిపి అధిష్టానం కొవ్వూరు అభ్యర్థిగా నియమించారు. గోపాలపురంలో టిడిపి తరపున బరిలో నిలిచిన ముప్పిడి వెంకటేశ్వరరావుకు టిడిపి అధిష్టానం కొవ్వూరు టికెట్ కేటాయించింది. ఈ నేపథ్యంలో ముప్పిడి వర్సెస్ తలారి మధ్య ముచ్చటగా మూడోసారి పోటీ నెలకొంది. ఈ హ్యాట్రిక్ పోటీలో విజేతగా ఎవరు నిలుస్తారోనని నియోజకవర్గ ఓటర్లు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

జవహర్ వర్గీయుల నిరసన

కొవ్వూరు నియోజకవర్గం టిడిపి టికెట్ను జవహర్‌కు కేటాయించకపోవడంతో ఆయన వర్గీయులు పార్టీ అధిష్టానం తీరుపై నిరసన వ్యక్తం చేశారు. పార్టీ ప్రతినిధిగా వచ్చిన సుజయ్ కృష్ణ రంగారావు వద్ద ఆందోళన చేపట్టారు. టిడిపి ఫ్లెక్సీలు చింపివేశారు.

ప్రభుత్వ కార్యాలయాలు ప్రారంభం



గ్రామ సచివాలయం ప్రారంభిస్తున్న కోట నరసింహం

ప్రజాశక్తి- గోకవరం

వెదురుపాక పంచాయతీ పరిధిలో వైసిపి నాయకుల ఆధ్వర్యంలో పలు ప్రభుత్వ కార్యాలయాలను గురువారం ప్రారంభించారు. మాజీ మంత్రి, వైసిపి జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట నరసింహం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రామ సచివాలయం, హెల్త్ క్లినిక్ సెంటర్, రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నరసింహం మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గ్రామీణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాల్లో ప్రజల అవసరాలు, సమస్యలు, ఆరోగ్య అవసరాలను తీర్చడానికి ఎన్నో కోట్ల రూపాయలు వెచ్చించి ఈ ప్రభుత్వ భవనాలు నిర్మించారన్నారు. ప్రతి పేదవాడికీ సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రతి పేదవాడికీ ఉండటానికి ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించి జగనన్న కాలనీ అనే పేరు పెట్టి వారికి అనేక విధాలుగా సౌకర్యాలు కల్పించారన్నారు. జగన్ మోహన్ రెడ్డిని మరోసారి గెలిపించుకుని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సుంకర శ్రీవల్లి, సర్పంచ్ దాసరి సింగారమ్మ, వైసిపి నాయకులు దాసరి చినబాబు, సుంకర వీరబాబు, వరసాల ప్రసాద్, గుల్లా ఏడుకొండలు, కొల్లాటి రామకృష్ణ, దాసరి రామకృష్ణ, దాసరి నాగ విష్ణు, ఆకుల సుబ్రమణ్యం, ఎం.శ్రీను, ఎస్.శ్రీనివాస్, వి.శ్రీను, వీరబాబు, దుర్గాప్రసాద్, అప్పారావు, రాజు, హర్ష, నాగేశ్వరరావు, ఎన్.నరసయ్య, రామ్‌ప్రసాద్, ఎంపిటిసిలు, సర్పంచులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ఎంఎల్‌ఎ జక్కంపూడి రాజా

ప్రజాశక్తి-రాజానగరం

మండలంలోని దివాన్ చెరువు గ్రామంలో సుమారు రూ.4 కోట్లతో మల్టీ ఇండోర్ స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణ పనులకు రాజానగరం ఎంఎల్‌ఎ జక్కంపూడి రాజా గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో క్రీడాకారుల నైపుణ్యాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. ఇప్పటికే సీతానగరం గ్రామంలో క్రీడా వికాస కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ మల్టీ స్పోర్ట్స్ ఇండోర్ స్టేడియంను రెండు అంతస్తుల్లో నిర్మిస్తున్నామని చెప్పారు. దీనిలో షటిల్ కోర్టు టేబుల్ టెన్నిస్ కోర్టుల నిర్మాణం, క్రీడాకారులకు డార్మెటరీ గదులు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. దీనిలో మండల కన్వీనర్ దూలంపెద్ద, వేమగిరి కృష్ణ, గంగిశెట్టి సోమేశ్వరరావు, మెట్ల ఏసుపాదం, దివాన్ చెరువు గ్రామ నాయకులు యర్రంశెట్టి ధర్మరాజు, మార్గాని శ్రీను, మందాల వెంకటేశు, పలివెల స్వామి పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న తోట వాణి

గంగంపాలెంలో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని గంగంపాలెంలో గురువారం మాజీ మంత్రి, వైసిపి జగ్గంపేట ఇన్‌ఛార్జి తోట నరసింహం సతీమణి తోట వాణి, కోడలు శ్రీనిధి, వైసిపి నాయకులతో కలిసి గడప గడపకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తోట వాణి, శ్రీనిధి గడప గడపకు వెళ్లి సిఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి మతం, కులం, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ అమలు పరిచిన సంక్షేమ పథకాలను వివరించారు. సిఎం వైఎస్.జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా, తోట నరసింహంను ఎంఎల్‌ఎగా, చలమలశెట్టి సునీల్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు.

జనసేనలోకి బాలసుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి-నిడదవోలు

వైసిపి నాయకులు కొత్తపల్లి బాలసుబ్రమణ్యం గురువారం జనసేన పార్టీలో చేశారు. జనసేన పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి గొల్లకోటి రాజేష్ ఆధ్వర్యంలో నిడదవోలు అభ్యర్థి కందుల దుర్గేష్ సమక్షంలో ఆయన జనసేన పార్టీలో చేరారు.


జన ఔషధిలో చౌకగా మందులు



జనరిక్ మందులు అందజేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి -గోకవరం

ప్రజల ఆరోగ్య సంరక్షణలో పేదలకు తక్కువ ధరకు న్యాయమైన మందులను అందించడమే లక్ష్యంగా జన ఔషధీ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు కామరాజుపేట సొసైటీ అధ్యక్షుడు పిడెం సతీష్ కుమార్ అన్నారు. గురువారం సొసైటీ కార్యాలయంలో ప్రధానమంత్రి భారతీయ జన ఔషధీ కేంద్రాన్ని సతీష్ కుమార్, మాగంటి చిన్న రాము ప్రారంభించారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ ప్రధానమంత్రి భారతీయ జన ఔషధీ కేంద్రాల్లో విక్రయించే మందులు ఖరీదైన బ్రాండెడ్ ఔషధాలని, వీటిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సిఇఒ కె.వీరభద్రరావు, ఎంపిటిసి మజ్జూరి అప్పారావు, మాజీ సర్పంచ్ జాజుల ప్రసాద్, ముదిలి రాజశేఖర్, మాగంటి ప్రసాద్, పిడుం శ్రీను, పైడిమల్ల లక్ష్మణరావు, మారిచర్ల అప్పారావు, యూదాల ఆదియ్య, సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



సామగ్రి అందించిన ఐటిసి ప్రతినిధులు

పాఠశాలకు విద్యాసామగ్రి అందజేత

ప్రజాశక్తి-గోపాలపురం

ఇండియన్ టొబాకో కంపెనీ ఐటిసి కంపెనీ సౌజన్యంతో గురువారం వెల్లచింతలగూడెంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు విద్యాసామాగ్రి అందజేశారు. ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఐటిసి కంపెనీ వారు మాట్లాడుతూ ఇక్కడ చదువుతున్న విద్యార్థులు అందరూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రత్నమణి, శ్రీలక్ష్మి, సిఆర్‌పి కొయ్య నాగరాజు పాల్గొన్నారు.

పెరవలి ఓటర్ లిస్ట్ విడుదల

ప్రజాశక్తి-పెరవలి

నిడదవోలు నియోజకవర్గంలో 2,11,874 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 1,03,600 మంది, స్త్రీలు 1,08,269 మంది, ఇతరులు ముగ్గురు ఓటర్లు ఉన్నట్టు నియోజవర్గ ఎన్నికల అధికారి ఎం.ఝాన్సీ రాణి తెలిపారు. నిడదవోలు పట్టణం, మండలంలో 92,359 మంది ఓటర్లు, ఉండ్రాజవరం మండలంలో 61,864 మంది ఓటర్లు, పెరవలి మండలంలో 57,651 మంది ఓటర్లు ఉన్నట్టు వెల్లడించారు.

జనసేన సమావేశంలో దుర్గేష్

ప్రజాశక్తి - నిడదవోలు

జనసేన పార్టీ నిడదవోలు నియోజకవర్గ అభ్యర్థి కందుల దుర్గేష్ ఆనంద్ ఇన్ రెస్టారెంట్‌లో గురువారం పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థిని గెలిపించుకోవాలన్నారు. తద్వారా నిడదవోలు నియోజకవర్గంలో యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నిడదవోలు ఇన్‌ఛార్జి భోగిపల్లి ప్రసాద్, రంగా రమేష్ పాల్గొన్నారు



పట్టాలు పంపిణీ చేస్తున్న తోట నరసింహం

లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని వెదురుపాక, బావాజీ పేట గ్రామాలకు చెందిన 162 మంది లబ్ధిదారులకు జగనన్న ఇంటి పట్టాలను మాజీ మంత్రి, వైసిపి జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట నరసింహం గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరసింహం మాట్లాడుతూ పేదవాడి ఇంటి కల నెరవేరే విధంగా సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రతి పేదవాడి ఇంటి కల నెరవేర్చారని చెప్పారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించి పేదల హృదయాల్లో చెరగని ముద్ర వేశారన్నారు. రాబోయే ఎన్నికల్లో సిఎం జగన్మోహన్ రెడ్డి అమలు పరిచిన పథకాలే ఆయనను మళ్లీ గెలిపిస్తాయని తెలిపారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు విభాగం సెక్రటరీగా గుమ్మడి

ప్రజాశక్తి-చాగల్లు

చంద్రవరం గ్రామానికి చెందిన గుమ్మడి శైలేందర్ రావు వైసిపి రైతు విభాగం రాష్ట్ర సెక్రటరీగా నియమితులు కావడంతో పలువురు గురువారం ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శైలేంద్రరావు మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కల్పించిన సిఎం వైఎస్.జగన్, మిథున్ రెడ్డి, రాజీవ్ కృష్ణ, పార్టీ కొవ్వూరు ఇన్‌ఛార్జి తలారి వెంకటరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయనకు ఎంపిపి మట్టా వీరాస్వామి, జెడ్‌పిటిసి గారపాటి శ్రీనివాస్, జెఏసి నాయుకులు బండి అశోక్ బాబు శుభాకాంక్షలు తెలిపారు.

వేణును గెలిపించాలని పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-కడియం

రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో రాజమహేంద్రవరం రూరల్ నుంచి చెల్లుబోయిన వేణు గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జెసిఎస్ ఇంచార్జ్ తాడాల విష్ణు చక్రవర్తి అన్నారు. మండల కేంద్రమైన కడియంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు ఇంటి వద్ద కడియం నాలుగు సచివాలయాలకు చెందిన బూత్ కోర్ కమిటీ సభ్యులకు గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చక్రవర్తి మాట్లాడుతూ కడియం గ్రామంలో అందరూ బూత్ స్థాయిలో, సమన్వయంతో కలిసి కట్టుగా పనిచేయాలని కోరారు. ప్రతి కార్యకర్త రానున్న నలభై రోజులును చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకుని రాజమహేంద్రవరం రూరల్ ఎంఎలె అభ్యర్థి వేణు గెలుపే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కొత్తూరి బాల నాగేశ్వరరావు, శాకా పట్టాభి, సర్కార్ బాషా, పున్నమి రాజు, వీర్రాజు, లావేటి రమేష్ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపిలో పలువురి చేరిక

కడియం : పొట్టిలంక వీవర్స్ కాలనీలో టిడిపి, జనసేనకు చెందిన 40 చేనేత కుటుంబాలకు చెందిన వారు మంత్రి వేణు కుమారుడు నరేన్ సమక్షంలో గురువారం వైసిపిలో చేరారు. నియోజకవర్గాన్ని పట్టించుకోని బుచ్చయ్య చౌదరికి టిడిపి సీటు కేటాయించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా నరేన్ మాట్లాడుతూ వారికి ఏ విధమైన సమస్యలు వచ్చినా వెంటనే పరిష్కరిస్తామని, వారికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య మాట్లాడుతూ వేణుగోపాల కృష్ణను గెలిపించుకుని మళ్ళీ మంత్రిగా చేసుకొనే భాధ్యత అందరి మీద ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి వెంకటేశ్వరరావు, నూలు మల్లేశ్వరరావు, ముక్తేశ్వరరావు, చినవీర్రాజు, కొత్తపల్లి సత్య, కృష్ణ, వీరభద్రరావు, ప్రకాష్, సూరిబాబు, గంగాధరం, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైసిపి బైక్ ర్యాలీ

పెరవలి : ఎంఎల్‌ఎ జి. శ్రీనివాస్‌నాయుడు ఆధ్వర్యంలో గురువారం ఉండ్రాజవరం, పెరవలి మండలాల్లోని పలు గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. పాలంగి, ఉండ్రాజవరం, మోర్త, దమ్మెన్ను, నడుపల్లికోట, కానూరు, తీపర్రు, పెరవలి, నల్లాకులవారిపాలెం, ముక్కామల, ఖండవల్లి, అన్నవరప్పాడు పిట్టలవేమవరం గ్రామాల మీదుగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కె.సీతారామ్‌ప్రసాద్, వైసిపి మండల అధ్యక్షుడు వీరమల్లు సత్యనారాయణ, రామడుగుల సూర్యనారాయణ, భావన మధు, తోట గోపి, పంపన అంజి, కేతా త్రిమూర్తులు, అంబటి లక్ష్మీ బ్రహ్మాయ్య, వైసిపి సర్పంచులు ఎంపీటీసీలు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీలో పాల్గొన్నారు

ఇంటర్ పరీక్షకు 266 మంది హాజరు

చాగల్లు : చాగల్లు శ్రీ వెలగపూడి రామకృష్ణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్ పరీక్షల్లో ఇంటర్ మొదటి సంవత్సరం 268 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారు. 266 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపల్ పావని తెలిపారు. పాఠశాలకు ఫ్లయింగ్ స్క్వాడ్ వచ్చినట్లు తెలిపారు.

మద్దిపాటి అభ్యర్థిత్వంపై హర్షాతిరేకాలు

గోపాలపురం : టిడిపి గోపాలపురం అభ్యర్థిగా మద్దిపాటి వెంకటరాజును ప్రకటించడంతో నియోజకవర్గంలోని ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పార్టీ కార్యాలయం వద్ద సందడి చేశారు. కేక్ కట్ చేసి బాణాసంచా పేల్చారు, స్వీట్లు పంపిణీ చేశారు. వేడుకలు ఘనంగా నిర్వహించారు.

'చేయూత' చెక్కుల అందజేత

మామిడికుదురు : నియోజకవర్గానికి చెందిన 15సచివాలయాల పరిధిలో 2679మంది మహిళా లబ్ధిదారులకు వైఎస్ఆర్ చేయూత రూ.అయిదు కోట్ల 2లక్షల 31వేలు చెక్కులను ఎంఎల్‌ఎ కొండేటి చిట్టి బాబు, జెడ్ పి చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్ పంపిణి చేశారు. ఈ సందర్భముగా వారు మాట్లాడు తూ సమాజం లో మహిళలకు ఆర్థిక చేయూత తో గౌరవ సానం కల్పించిన ఘనత సిఎం జగన్ కే దక్కుతుందన్నారు ఈ కార్యక్రమం లో ఎంపిపి కుసుమ వనజకుమారి శ్రీధర్, జెడ్‌పిటిసి కసిరెడ్డి అంజిబాబు, మామిడికుదురు పిఎసి చైరపర్సన్ కటకంశెట్టి ఆదిత్య, మండల వైసిపి అధ్యక్షులు కొమ్ముల రాము, సర్పెంచ్ లు సి హెచ్ శివ రామ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి-రామచంద్రపురం

ద్రాక్షారామలో మెదడు కు సంబంధించిన న్యూరోసిస్ తో బాధపడుతున్న చవ్వాకుల సుశీలకు సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.2 లక్షలు మంజూరయ్యాయి. ఈ చెక్కును గురువారం ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు ఇంటి వద్ద ఆయన తనయుడు తోట పథ్వీరాజ్ చేతుల మీదగా అందజేశారు. శస్త్ర చికిత్స కోసం సుశీల తాను ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకొని ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు రూ. 2 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించారనీ వారికి సుశీల కుటుంబ సభ్యులు కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అడవి కుమార్, మాజీ ఉపసర్పంచ్ పోలిశెట్టి తాత అబ్బాం , 4వవార్డ్ సభ్యులు యండమూరి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత

ప్రజాశక్తి-ముమ్మిడివరం

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు పాఠశాలల్లో పరిసరాల పరిశుభ్రతకు అత్యదిక ప్రాధాన్యతనివ్వాలని సాల్ట్ (సపోర్టింగ్ ఆంధ్రా లెర్నింగ్ ట్రాన్స్మిషన్) డిస్టిక్ కోఆర్డినేటర్ ఆషిక్ అలీబేగ్ సూచించారు. మండలంలోని ఠాణేలంక అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో గురువారం ఆకస్మికంగా సందర్శించిన అలీ బేగ్ మరియు సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎ మధుసూదనరావు లు సంయుక్తంగా గురుకుల పాఠశాలలో ప్రాంతంలో పరిసరాల శుభ్రత ను పరిశీలించడమే కాకుండా విద్యార్థినిలకు అందుతున్న సౌకర్యాలను స్వయంగా పరిశీలించారు. తనిఖీల్లో సమగ్ర శిక్ష అకాడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు, సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్ ఎంవివి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫిజియో థెరపిస్ట్ ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-ముమ్మిడివరం

భవిత కేంద్రాల్లో(ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు) ఖాళీగా ఉన్న 5 ఫిజియో థెరపిస్ట్ ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ఎ.మధుసూదన రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వివిధ మండలాల్లో భవిత కేంద్రాల్లో ఖాళీగా ఉన్న 5 ఫిజియోథెరపిస్ట్ ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు. అభ్యర్థులు. బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపి(బిపిటి) మరియు మాస్టర్ ఆఫ్ ఫిజియో థెరపి(ఎంపిటి) పూర్తి చేసి ఉండాలన్నారు. ఎంపికైన వారికి రూ.12 వేలు గౌరవ వేతనం ఉంటుందన్నారు. దరఖాస్తులను నెల 19 లోపు సమగ్ర శిక్ష అడి షనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల, జిల్లా కార్యాలయాల ప్రాంగణం, ముమ్మిడివరం లో అందజేయాలని పేర్కొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే లక్ష్యం



ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్‌సి తోట తదితరులు

ప్రజాశక్తి-మండపేట

ప్రతి ఇంటికి తాగునీరు అందించడం లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని తాపేశ్వరం గ్రామంలో గ్రామ సర్పంచ్ వాసంశెట్టి రాజేశ్వరి, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు రెడ్డి రాజాబాబు రెడ్డి రాజాబాబు, వైసిపి రాష్ట్ర నాయకులు కర్రి పాపారాయుడు, ఎంపిపి ఉండమట్ల వాసుతో కలిసి జల్ జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా రూ.47 లక్షలతో నిర్మించనున్న వాటర్ ట్యాంక్, పైప్లైన్ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.63 లక్షలు ఎంజిఎన్ఆర్జిఎస్ నిధులతో నిర్మించిన రెండు సచివాలయాలను ఆయన ప్రారంభించారు. తొలుత సచివాలయం వద్ద ఏర్పాటుచేసిన అంబేద్కర్ విగ్రహన్ని ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ దేవుడు కాలనీకి తాగునీరు అందించడంతో పాటు కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కరోనా సమయంలో వాలంటీర్ వ్యవస్థతో సిఎం జగన్ ప్రజలకు సేవలు అందించిన విషయాన్ని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు నాగిరెడ్డి రాంబాబు, ఎంపిటిసి సభ్యులు, మండల అభివద్ధి అధికారి కె.శ్రీదేవి, అధికారి విస్తరణ అధికారి ఐదం రాజు, పంచాయతీ కార్యదర్శి పి.శ్రీనివాస్, అసిస్టెంట్ ఇంజినీర్లు భాగ్యరాజు, నాగేశ్వరరావు, దాసరి లాజర్, బూర చిన్న, వల్లూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి-రామచంద్రపురం

మన ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ విజ్ఞప్తి చేశారు. గురువారం ద్రాక్షారామ లో ఇంటింటికీ వెళ్లి చెత్త బుట్టలు పంపిణీ చేశారు. ఇంటిలోని చెత్తను రోడ్డు పై వేయకుండా పరిసరాల పరిశుభ్రత ను గురించి ఆమెవివరించారు . చెత్తాచెదారం వల్ల ఈగలు, దోమలు వద్ధి చెంది పలు రోగాలకు కారణమవుతాయని ఆమెవివరించారు. కార్య క్రమంలో మండల ఉపాధ్యక్షులు నరాల రాజ్యలక్ష్మి, ఉప సర్పంచి పెన్నాడ బుచ్చిరాజు, కార్యదర్శి వెలివేటి సూర్య సుబ్రహ్మణ్యం, వార్డ్ సభ్యులు, సచివాలయ సిబ్బంది పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న విద్యార్థి సత్య ప్రవీణ్

జాతీయ స్థాయికి ప్రవీణ్ ప్రాజెక్ట్ ఎంపిక

ప్రజాశక్తి-అమలాపురం

రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శనలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాకు విద్యార్థి రూపొందించిన ప్రాజెక్ట్ జాతీయ స్థాయికి ఎంపికైంది. చిత్తూరు జిల్లా పలమనేరులో జరిగిన రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శనలో మహాత్మా గాంధీ మునిసిపల్ హైస్కూల్ ఉన్నత పాఠశాల విద్యార్థి నక్కా సత్య ప్రవీణ్ (8వ తరగతి) తయారుచేసిన ప్లాంట్స్ గ్రోయింగ్ మిషన్ జాతీయ స్థాయికి ఎంపికయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.ఆర్.కామేశ్వర రావు గురువారం తెలిపారు. గైడ్ టీచర్‌గా మామిడిశెట్టి వేంకటేశ్వర రావు వ్యవహరియించినట్లు తెలిపారు. విద్యార్థి ప్రవీణ్‌ను మునిసిపల్ ఛైర్ పర్సన్ కమిషనర్ తదితరులు అభినందించారు.